# అసమర్థుని జావా యాత్ర

మహానామ

*చాలా బాధగా వుంది బాబూరావుకి...*

*ఏం చెయ్యాలో తోచట్లేదు. జుట్టు ఎంతసేపని పీక్కుంటాడు?*

*ఎందుకిలా జరిగింది... ఎక్కడ పొరపాటు జరిగింది? ప్రతి పనిలోనూ ఇలాగే జరుగుతోందేమిటి?*

*చిన్నప్పట్నించీ ఇంతే. తను అనుకున్నది ఎన్నడూ సాధించలేకపోయాడు. సాధించటం పక్కనపెట్టి కనీసం అనుకున్న దానిపై నిలకడగా శ్రద్ధ కూడా చూపించలేకపోవడం తనకి జీవితంలో ఓ భాగమైందేమిటీ?*

బైపీసీ తెలుగు మీడియం వద్దు ఇంగ్లీషు మీడియంలో చేరమని అన్న చెప్పినప్పుడు కరక్టే కదా అనిపించింది. ఇంగ్లీషు మీడియంకి అలవాటు కాకపోతే ముందుముందు కష్టం అంటే ఓకే అన్నాడు. తర్వాతేం జరిగింది? లాంగ్వేజీల్లో తప్ప అన్నిట్లోనూ సున్నాకంటే తక్కువ మార్కులే. ఎలాగోలా అన్న సాయంతో ఇంటర్ అయిందనిపించాడు. గతంలోనయితే అన్నయ్య అనేవాడు కానీ టీఆరెస్ తర్వాత అన్న అందామనిపించింది. అలా అంటే బావుంటుందని ఎవరో చెప్పారు తనకి.

ఇదిగో... ఇదే ప్రాబ్లం. ఎవరేది చెప్పినా వెంటనే పట్టేస్తుంది బుర్రకి.

'నీకు విషయాలపట్ల క్లారిటీ లేదు' మా.లె. స్నేహితులెన్నిసార్లు అన్నారో. వాళ్లు ఆ మాట అన్నప్పుడు కొంచెం కోపమొచ్చింది... సర్కిల్లోని అమ్మాయిలు అన్నప్పుడు కొంచెం బాధేసింది. నిజమేనేమో అనిపించింది.

అనిపించడమేమిటి? కనిపిస్తుంటే?

ఇదిగో ఇప్పుడు...

కౌన్ బనేగా కరోడ్‌పతి ద్వారా కనీసం పాతిక లక్షలు సంపాదిస్తే... అందులో సగం ఎఫ్‌డీలు చేసి దాంతో వచ్చే ఇంటరెస్ట్ డబ్బుల్తో ఫామిలీ బతుకుతుంది కదా... మిగిలిన డబ్బుల్తో ఏదో ఒక పార్టీలో చేరిపోయి మెల్లిగా ఎమ్మెల్యే అవుదామని తన ఎయిమ్.


అసెంబ్లీ ముందునుంచి వెళ్తున్న ప్రతిసారీ నాకంటే చాలా తక్కువ క్వాలిఫికేషనున్న వాళ్లెందరో లోపలుంటే నేనేంటీ బయటున్నాను అనిపించేది. 'నో దిస్ కెన్ నో లాంగర్ కంటిన్యూ' అనుకునేవాడు. ఈ ఇంగ్లీషు భాషింతే. వచ్చిందంటే ధారాళంగా వచ్చేస్తుంది.

తర్వాత... అమెరికా ఉద్యోగమొస్తుందనుకున్నప్పుడు- అయిదేళ్లు అక్కడుండొస్తే చాలు. దాచుకున్న డబ్బుల్తో ఎంచక్కా ఎమ్మెల్యేనవ్వచ్చు... ఇలా వుండేవి ఆలోచన్లు.

'ఇక్కడ నైట్ లైఫ్ చాలా బాగుంటుంది... హాయిగా ఎంజాయ్ చెయ్యొచ్చ'ని ఫైజీ చెప్పినప్పుడు వాడి మీద కుళ్లుకున్నాడు కూడా. టెక్నికల్ ఎక్స్‌పోజర్... డబ్బులు... ఇలాంటివి పైకి చెప్పినా- ఒంటరి జీవితం గడపడంలోని ఆనందాన్ని చవిచూడాలని జివజివగా వుండేది.

'ఈ ఇంటర్నెట్‌లు, అమెరికా జాబ్‌లూ, ఐటీ- ఇవేవీ మన ఎకానమీకి కంట్రిబ్యూషన్ కాదు. నీలాంటి వాళ్లు కూడా ఈ విష సంస్కృతిలోకి వెళ్లడం నేను అర్థం చేసుకోలేకపోతున్నాను' అని ఏజెడ్ (అందరూ అలాగే పిలుస్తారు, అసలు పేరు తెలిసినా) అన్నప్పుడు కించిత్ సిగ్గు కలిగింది.

నేనేమిటి అందర్లా ఆలోచిస్తున్నాను? నాకూ మిగిలిన వాళ్లకీ తేడా లేదా? ఉందనుకున్న చైతన్యం ఎక్కడో ఆగిందనుకున్నప్పుడు మరింత సిగ్గు కలిగింది.





గద్దర్ పాట వింటున్నంతసేపూ ఎర్రగా రంగుదేలిన మొహం ఇప్పుడు సిగ్గిల్లి నల్లబడింది.

'నువ్వేమిటసలు? ఏదీ తేల్చుకోలేవు ఓ పట్టాన' విసుగ్గా అంది శ్రీమతి.

ఇంకా సెటిల్ అవలేదన్న ఆమె ఆవేదన అర్థమవుతోంది తనకు. కానీ ఏం చేసేది? ఈ ప్రపంచంలో తనకి సూట్ అయే ఓ వృత్తి లేనప్పుడు తను మాత్రమేం చేస్తాడు?

'ప్రతి దాంట్లోనూ యేదో ఓ లోపం వెతుకుతావు. కనిపించని కోణాన్నేదో లాగే పీకే ప్రయత్నం... విషయాల్నెప్పుడు గ్రే ఏరియాలో చూడడం మానేసి అప్పుడప్పుడు బ్లాక్ అండ్ వైట్‌లో కూడా చూడడం నేర్చుకో' అంటూనే వుంది ఇంకా.

తప్పు చేశాడు తను. హాయిగా వీక్లీలు చదువుకునే దాన్ని మైదానంలోకి లాక్కువచ్చాడు.

తను ఎవరికీ అర్థంకావటం లేదు. ఎవరూ తనకి అర్థమయ్యేట్టు లేరు. ఎలా? ఏం చెయ్యాలి?

'జావా చెయ్యి' మెర్లిన్ డిసౌజా చెప్పింది.

నిజమే. ఈ టెక్నాలజీ భలే వుంది. తనకు చాలా బాగా అర్థమయింది. ఐటీతో సంబంధంలేకపోవడం వల్ల చాలామందికి జావాలోని అందం తెలియడం లేదు. పాయా తినని వాళ్ల గురించి కూడా అతని ఉద్దేశమిదే.

అలా ఆర్నెల్లలో జావా అయిపోయింది. నెలకి కనీసం లక్షన్నర దాచొచ్చనుకుని అమెరికా వచ్చాడు తను. మొదట్లో బాగానే వుండేది. లక్షన్నర కాదుగానీ ముప్పైవేలు దాచేవాడు.

'అప్పుడే ఎక్కడా ఇంకో నాలుగు నెల్లు అయితే కానీ దాచటం కుదర్దు' మొదటినెలే చెప్పేసాడు శ్రీమతికి. చెప్పేసాడు కాబట్టి ఈ నాలుగు నెల్ల డబ్బుల్తో జల్సా చేయొచ్చన్నది ప్లాన్... అలాగే జరిగింది కూడా. గంటల తరబడి ఇంటర్‌నెట్‌పైనే... ఎవరెవరితోనో చాట్ చేసేవాడు.

'డునాట్ వేర్ అండర్‌వేర్ వైల్ చాటింగ్' ఓ అమ్మాయి చెప్పింది చాట్‌లో. అదీ ఫాలో అయ్యాడు.

అదిగో ఆ నాలుగు నెల్లే తన జీవితంలోని అర్థవంతమైన రోజులు...

తర్వాత పరిస్థితి మారింది. జావా వాళ్లందరూ దిక్కుమొక్కు లేని జనం... ఇండియాలోనయితే ఒక్కొక్కరు అగ్నికణం అని పాటైనా పాడుకొందును. ఇక్కడ అదీ లేదు. ఎంత చెడ్డా మన దేశం, మన ప్రభుత్వం. జైల్లో పెట్టినా ఏదోటి పెడతారు తింటానికి.

రెండు ప్రాజెక్టుల మధ్యకాలంలో ఖాళీ... బెంచీ మీద వుండేవాడు. ప్రస్తుతం బెంచీ కిందే చాలామంది వున్నారు.

ఏం చెయ్యాలి? మళ్లీ ప్రశ్న. కొన్ని వందల వేల సార్లు వేసుకున్న ప్రశ్న...

'ఇండియాకి వచ్చెయ్. ఏమీ లేకపోయినా జీరో బేస్డ్‌గా లైఫ్‌ని ప్రారంభించే ఆత్మవిశ్వాసం నీకుంది' ధైర్యం చెప్పాడు క్రాంతి.

తనకి తెలుసు తను సామాన్యుడు కాదని. జీరో బేస్డ్ ఎంత అందమైన అబద్ధమో తెలుసు. తన కులం, ప్రాంతం, వర్గం- అవి అందించే ఆత్మవిశ్వాసం ఇవి ఎక్కడికి పోతాయి? వీటేటినీ ఉపయోగించుకున్నట్టు కాదా? 'నేనెవరి బిడ్డగానో రాలేదు నాకీ గుర్తింపు' అని మొదట్లో అనుకునే వాడు. అది చాలా తృప్తినిచ్చేది. నాలుగో తరగతి వరకే చదివి ఇప్పుడు మట్టిగొట్టుకుపోయిన మాలసాయిలు ఊళ్లోనే ఉండడానికి గల నేపథ్యం... అంతే తెలివితేటలు గల తను అమెరికాలో మట్టిగొట్టుకుపోయేంత వరకు ఎదగడానికి వున్న నేపథ్యం... ఎలా? ఎలా? ఎలా? వదిలేయాలి? ఎలా 'నేను ఏమీ కాదు జీరో బేస్డ్‌గా మొదలుపెట్టాను జీవితం' అని చెప్పను? నాకు తెలుసు నేను సామాన్యుడ్ని కాదని.

'టేక్ మై వర్డ్. యు కెన్ నెవర్ సెటిల్' సంపూర్ణ అంది. అ అమ్మాయికి నేను ఐటీ పాఠాలు చెప్పాను. ఇప్పటికి డజను ఉద్యోగాలు మారింది. మారుతూనే వుంది. జావా వేస్టని తేల్చుకుని మరోటి నేర్చుకుంది. అది పనికిరాదని మరోటి... ఇలా ఎన్ని నేర్చుకోటం? ఎన్నాళ్లని?

గాలివాటులో కొట్టుకుపోతున్న తనని చూస్తే

జాలేసేది.

'సంపూర్ణకేం? నెలకి నలభై వేలు సంపాదిస్తోంది. కొలీగ్‌ని పెళ్లిచేసుకుంది. యూకే, యూయెస్, దుబాయ్ అన్నీ తిరిగొచ్చింది. మొన్నే పిల్లాడ్నీ కంది. హాయిగా వుంది' తెలిసింది తనకి.

నిరాసక్తంగా అనిపించింది.

***

లాభం లేదు. తేల్చుకోవాలి. అటో ఇటో... ఐటో కాదో...

'కాసేపట్లో టీవీలో కొత్త సినిమా. నాగార్జునది. లోపలికొస్తావా' మినపగుళ్లు నానేస్తూ వంటింట్లోంచి శ్రీమతి.

'ఈ చెత్త సినిమాలూ సీరియళ్లూ నావల్ల కాదు'

ఉన్నట్టుండి అనిపించింది-

'చచ్చిపోతే...'

కానీ ఎలా?

ఎలాగోలా? ఈ రాత్రికే అయిపోవాలి...

కాసేపు బయటికి వెళ్లొచ్చాడు.

పెస్టిసైడ్ షాపునుంచి తెచ్చుకున్న సీసా మంచం పక్కన పెట్టుకున్నాడు.

అయిపోవాలి. తెల్లవారు ఝామున మూడింటికి... బ్రహ్మమూహూర్తం...

నిద్ర పట్టటం లేదు.

ఒకటిన్నర. టీవీ ముందు సోఫాలో నిద్రపోతోంది. సినిమా వస్తూవుంది...

ఇంటర్నెట్ వుంటే బాగుండు. చాట్ చేసేవాణ్ని...

ఈ హీరోయిన్ భలే వుంది...వాటె మిస్టిక్ బ్యూటీ...

చూస్తూ చూస్తూనే...

మెలకువొచ్చింది. ఆరున్నర.

గుభేలంది గుండె. మంచం దగ్గరి మందు గుర్తొచ్చి. ఇంకా తను లేవలేదు. ఈ పాలవాడొకడు దబదబా బాదుతున్నాడు అందరూ లేచేలా.

ఒక్క ఉదుటున బాటల్ అందుకుని వీధిలోకి నడిచాడు.

అర్థరూపాయి సులభ్ కాంప్లెక్స్ అటెండర్ చేతిలో పెట్టి లోపలికి నడిచాడు.వచ్చేప్పుడు పెన్ను తెచ్చుకున్నాడు.

తమందు బాటిల్‌నంతా వొంపేసి ఫ్లష్ నొక్కితే నీళ్లు రాలేదు. మగ్గుతో నీళ్లు పోసాడు.

పెన్నుతో గోడపై రాశాడు-

'సిగ్రమాన్...'

***

పరమ సంతోషంగా వుంది. ఎదురుగా బండీపై చాయ్ తాగి రెడ్ విల్స్ గుండెల నిండా పీల్చి...

కెరీర్ క్రానికల్ కొనుక్కొని వడివడిగా ఇంటివైపు అడుగులేస్తూ లైవ్‌లీ బాబూరావు... ●

# భారతీయ సాహిత్యంపై గాంధీజీ ప్రభావం

భారతీయ సాహిత్యంపైన, తెలుగు సాహిత్యంపైన గాంధీ మహాత్ముని ప్రభావం అపరిమితం. ఆయన ఆచరణ, రచనలు, వ్యవహారసరళి సాహితీసృజనకు ప్రేరకంగా నిలిచాయి. ఎందరో సాహిత్యకారులకు స్ఫూర్తిని ఇచ్చాయి. నేటికీ గాంధీ ఆలోచనలు, సిద్ధాంతాలు సృజనాత్మక రచయితలకు ప్రేరణగా ఉన్నాయి. వాటి గురించి అవలోకించుకోకుండా ఉండలేం. ప్రకృతికి సన్నిహితంగా జీవించాలనే ఆలోచన గాంధీజీ ప్రబోధాల స్ఫూర్తి ఫలితంగా వచ్చిందే. త్రికరణశుద్ధిగా గాంధీ ఆలోచనల్ని, విశ్వాసాల్ని నమ్మి రచనలు సాగించేవారు స్వాతంత్ర్యానికి పూర్వమే కాదు ఇప్పుడు కూడా ఉన్నారు. కనుక అసలు మహాత్ముని ఆలోచనలు సృజనకారుల్లో ఎవరికి ఏవిధంగా స్ఫూర్తినిచ్చాయో పరిశీలిద్దాం.

గాంధీ ప్రభావంతో నవలలు, ఆంగ్లంలో మొదట రాసిన వాళ్ళల్లో కె.ఎస్.వెంకటరమణ అనే రచయిత రాసిన 'మురుగన్ ది టిల్లర్' (మురుగన్ అనే రైతు' 'కందన్ నది పేట్రియాట్' (దేశభక్తుడైన కందన్) అనేవి - మొదటి దానిలో 'గాంధీ ఆర్థిక విధానాన్ని' చిత్రిస్తే- రెండోదానిలో 'గాంధీజీ రాజకీయప్రభావం' చెప్పబడింది. కె.ఎ.అబ్బాస్ 'ఇంక్విలాబ్' (తిరుగబాటు) అనేదానిలో స్వాతంత్ర్య సమరకాలపు మహానీయులెందరో చిత్రింపబడ్డారు.



ప్రముఖ భారతీయ ఆంగ్లరచయితలలో దాదాపుగా తాము రచించిన కొన్ని నవలల్లో గాంధీ ప్రభావం, గాంధీ సిద్ధాంతాల ప్రభావం చిత్రించారు. కొందరైతే తాము అల్లిన కథల్లో గాంధీ పాత్రనే ప్రవేశపెట్టారు.

విశ్వవిఖ్యాత నవలాకారుడైన ముల్కరాజ్ ఆనంద్ రాసిన- 'అన్‌టుబబుల్' (అంటరానివాడు) 'ది స్వోర్డ్ అండ్ ది సికిల్' (ఖడ్గము - కొడవలి) నవలల్లో గాంధీ పాత్ర వున్నది. అలాగే ఆర్.కె.నారాయణ్ నవల 'వెయిటింగ్ ఫర్ మహాత్మా' (మహాత్ముడి కోసం వేచివుండుట)- అలాగే రాజారావు రాసిన 'కాంతాపుర'లో ఆ వూరి (కాంతాపురం) ప్రజల మీద గాంధీ ప్రభావం బలంగా చిత్రితమైంది.

గాంధీజీ స్ఫూర్తితో ప్రముఖ రచయితల్లో కొందరు ఆంగ్లంలో కవితలు రాశారు. ఉదాహరణకు హుమాయున్ కబీర్, సిరిల్ మోడన్ వంటి వారున్నారు.

గాంధీజీ ప్రసంగాలు, రచనలు డి.జి. టెండూల్‌కర్ సంపాదకత్వంలో ఎనిమిది భాగాలుగా వెలువడింది. ఇంకా గాంధీ జీవిత చరిత్రను చాలామంది ఆంగ్లంలోనే కాక, వివిధ భారతీయ భాషల్లో రచించారు. ఆంగ్లంలో రాసినవారిలో ముఖ్యులు ప్యారేలాల్, హిరేన్ ముఖర్జీ మొదలైనవారున్నారు.

'గాంధీ మార్గం' పేరుతో జె.బి. కృపలాని- 'ఆచరణయోగ్యమైన అహింసా సిద్ధాంతం పేరుతో కె.జి.మష్రువాలా, ఆర్.ఆర్.దివాకర్ సత్యాగ్రహంపేర్లతో రచనలు చేశారు. ఇంకా గాంధీ ఆర్థిక విధానం ప్రభావం కూడా భారతీయసాహిత్యంపై ఉంది. ఆయన ప్రవచించిన గ్రామస్వరాజ్యం, కుటీరపరిశ్రమలు అర్థశతాబ్దం పాటు భారతీయ సాహిత్యాన్ని ప్రభావితం చేశాయి.

ఇక మన తెలుగు సాహిత్యం మీద గాంధీజీ, ఆయన ఆదర్శాలు గాంధీజీ సిద్ధాంతాల ప్రభావం స్వాతంత్ర్య పోరాటకాలంలోనే కాక, స్వాతంత్ర్యం పొందాక కూడా ఎంతో బలంగా ఉంది. గాంధీజీ హరిజనోద్ధరణను చిత్రించే గొప్ప నవల 'మాలపల్లి'. దీనిని ఉన్నవలక్ష్మినారాయణ రాశారు. ఆయన గాంధీజీ శిష్యుడుగా జైలుకెళ్ళి స్వాతంత్ర్యపోరాటం కూడా సాగించారు. గాంధేయవాదపు ఆలోచనల వెలుగులో ఆయన ఈ నవల రాశారు. 'గాంధీకవి'గా ప్రసిద్ధులైన తుమ్మల సీతారామ మూర్తి 'మహాత్మునికథ' రాశారు. మహీధర రామమోహనరావు 'కొల్లాయిగట్టితేనేమి?' నవల రాశారు. ఇక స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్న (ఆంధ్ర) భీష్మ, న్యాయపతి సుబ్బారావు దంపతులు, 'దేశభక్త' కొండావెంకటప్పయ్య, టంగుటూరి ప్రకాశం పంతులు, శ్రీకాశీనాధుని నాగేశ్వర్రావు, జాతీయజెండా రూపకకర్త పింగళివెంకయ్య, సరోజినీ నాయుడు, గాంధీ సూత్రభాష్యకారుడిగా ప్రసిద్ధిపొంది 'భారత జాతీయ కాంగ్రెస్ చరిత్ర'ని ఒక్కచేతి మీదుగా రచించిన డాక్టర్ పట్టాభి, తెన్నేటి విశ్వనాధం, అయ్యదేవర కాళేశ్వర్రావు, ఆచార్య ఎన్.జి.రంగా, డా॥బెజవాడ గోపాలరెడ్డి, శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్, త్రిపురనేని రామస్వామిచౌదరి, జాతీయకవి గరిమెళ్ళ, పుట్టపర్తి నారాయణాచార్య వంటివారెందరో వున్నారు.

వీరి రచనలపై సైతం గాంధీమహాత్ముని ప్రభావం ఉంది.

గాంధీజీ జీవితం, ఆయన నడిపిన స్వాతంత్ర్య పోరాటం అనేకమంది గాయకులకు పాటలు, బుర్రకథలు, శతకాలు, పద్యాలు, నాటకాలు రాయటానికి స్ఫూర్తిని ఇచ్చాయి.

పత్రికాప్రముఖులుగా ప్రసిద్ధిపొందిన ముట్నూరి, శ్రీ ఖాసా సుబ్బారావు, కోటం రాజు రామారావు, గోపరాజు రామచంద్రరావు, యం.చలపతిరావు, నార్ల వెంకటేశ్వరరావు, విద్యాన్ విశ్వం వంటివారెందరో గాంధీజీ ప్రభావంతో స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నవారు కొందరైతే- ఆ ప్రభావంతో సంఘ సంస్కరణకు తమ పత్రికలలో వ్యాసపరంపరలు రాసినవారు మరికొందరు.

ఇలా సాహితీవేత్త కాని ఆదర్శ రాజకీయవేత్త ప్రతిపాదించి ప్రచారం చేసిన సిద్ధాంతాలు ఆదర్శాలు, దేశభక్తి, చిత్తశుద్ధి, సత్యాహింసలు, హరిజనాభ్యుదయం, ఎందరో సాహితీ వేత్తలకు స్ఫూర్తినిచ్చి కథ, నవల, నాటకం, జీవితచరిత్ర, పాటలు, పద్యాలు, శతకాలు, బుర్రకథలు రాయటానికి మూలమైంది.

- ఎం.డి.సౌజన్య


రూ. 21,00,000/-ల విలువగల బహుమతులు గెలవండి - ఎంట్రీఫీజు లేదు

| ఉదాహరణ | | |
|---|---|---|
| 4 | 9 | 8 |
| 11 | 7 | 3 |
| 6 | 5 | 10 |

1 వ బహుమతులు - టాటాసుమో - (ఇద్దరికి)
2వ బహుమతులు - హీరోహోండా, (ఎనిమిది మందికి)
కన్సొలేషన్ బహుమతులు - వెస్పాస్కూటర్, సి.డి.ప్లేయర్, కలర్ టి.వి., ఆటోమేటిక్ కెమెరా, ఎయిర్‌కూలర్, వాషింగ్ మెషీన్, టు-ఇన్-వన్ (పథకం MB&HP క్రింద)

| | | |
|---|---|---|
| 5 | | |
| | 8 | |
| | | 11 |

* మొదటి 200 సరైన ఎంట్రీలకు ఒక్కొక్కరికి 4 గ్రాముల ఒక బంగారు నాణెం

పైన తెలిపిన విధంగా, తెల్లకాగితం మీద లేదా ఇన్‌లాండ్ లెటర్పై లేదా పోస్టుకార్డుపై 9 ఖాళీ చతురస్రాలు గీయండి. 4 నుండి 12 అంకెలు వాడుతూ ఏ కోణం నుంచి కూడినా 24 వచ్చేలా చూడండి..ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి., మీ ఎంట్రీలు సాధారణ పోస్టులో 15 రోజుల్లోగా చేరాలి. వెంటనే వ్రాయండి, ఆలస్యం చేయకండి.

Add :- DINA BHAVAN (D/50)
P.O. Lal Bigha (GAYA)

publisher is not responsible for any dispute in this regard